క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్‌పై కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఏర్పేడు: మండలంలోని కోబాక, కొత్తవీరాపురం అరుంధతివాడలో సోమవారం జల్‌జీవన్ మిషన్‌పై నాగేశ్వరరావు కళాజాత బృందం అవగాహన కల్పించింది. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటి సౌకర్యం, కుళాయి ఏర్పాటు తదితర అంశాలపై పాటలు, లఘు నాటిక రూపంలో గ్రామస్తులకు బృందం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రగతి జల్‌జీవన్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ ప్రభాకర్, ప్రతినిధి సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



అజయ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియమితులైన కమనంబేడుకు చెందిన అంబటి అజయ్‌కుమార్‌రెడ్డిని సోమవారం సింగిల్‌విండో చైర్మన్ పల్లం పత్తిహరనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఎం మోటార్స్ అధినేత మోహన్‌రావు, నాయకులు వెంకటరమణ, వేంకటేశ్వరరావు, సముద్రాల బాలాజీ, రాజేష్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, బీఎస్‌కండ్రిగ సర్పంచ్ బూదూరు వెంకటమ్మ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సురేష్‌బాబు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదుతున్న ఎం.నవీన్, వి.నివేత, పి.ప్రసన్న ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించడంతో సోమవారం ప్రిన్సిపల్ సురేష్ బాబు, అధ్యాపకులు అభినందించారు. వీరికి శాలువాలు కప్పి సన్మానించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు

రేణిగుంట: మండలంలోని విప్పమానుపట్టెడ, గాజులమండ్యం, అత్తూరు, సూరప్పకశం సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కరపత్ర ప్రచారం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ శశికిరణ్, దయాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మోహన్, రాంమోహన్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కరెంట్ స్తంభం నుంచి రాలుతున్న నిప్పురవ్వలు

కేవీబీపురం: మండలంలో పెరిందేశం దళితవాడలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ నుంచి కొన్ని రోజులుగా నిప్పురవ్వలు రేగుతున్నాయి. స్థానికులు ఇది గుర్తించి ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదనే విమర్శలొస్తున్నాయి. ఇది గ్రామానికి ప్రధాన మార్గంలోనే ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో విద్యార్థులు, చిన్నారులు ఎక్కువగా సంచరిస్తూంటారు. ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత అధికారులు ఉదాసీనంగా ఉండటంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా స్పందించాల్సి ఉంది.

ముగిసిన యువ ధార్మికోత్సవం

తిరుమల: ఆస్థాన మండపంలో దాస సాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన యువ ధార్మికోత్సవం సోమవారం ముగిసింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాఘవేంద్రాచార్యులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత, దైవభక్తి కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. దాసహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి వచ్చిన 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ పథకాలు

- గృహ సారథుల శిక్షణలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం





హాజరైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు, వలంటీర్లు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నాగలాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వారికి మార్గదర్శనం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ప్రభుత్వం అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలను ఇస్తోందన్నారు. తమ పరిధిలోని 25 ఇళ్లను గృహ సారథులు సందర్శిస్తూ వారి సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధుల ద్వారా పరిష్కరించాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా మోహన్ మొదలియార్

నాగలాపురం మండలం సచివాలయ కన్వీనర్‌గా ఇదే పట్టణానికి చెందిన మోహన్ మొదలియార్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు, పార్టీ నాయకులు మోహన్‌ను ఘనంగా సత్కరించారు.

నాగలాపురం ఈస్ట్‌లో గడప గడపకు..

నాగలాపురం తూర్పు దళితవాడలో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి గజమాలతో నివాళులర్పించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వారికి పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

నిధులు మంజూరైన టీపీ కోట రోడ్డు పనులు చేసి పూర్తి చేయాలని, తమ వీధుల్లో మురుగు కాలువ నిర్మించాలని, పింఛన్లు, ఇంటి పట్టా, జగనన్న ఇల్లు మంజూరు చేయాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. ఈ బడ్జెట్‌లో రోడ్డుకు నిధులు కేటాయిస్తారని ఎమ్మెల్యే వారికి బదులిచ్చారు. మిగిలిన సమస్యలు సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ పద్మజ, పార్టీ మండల కన్వీనర్ అపరంజి రాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సర్పంచ్ సుధ, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కల్పన, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, ఉదయ్‌కుమార్ రెడ్డి, గజేంద్ర, పాల పద్మనాభం, అలగేశన్, మురళి రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు: నాగలాపురం మండల కేంద్రంలోని విఘ్నేశ్వరుని ఆలయం వద్ద సోమవారం ఉదయం సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ పోస్టర్లను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఆనందుడు, ఎస్ఎం సురేష్, పార్టీ మండల కన్వీనర్ అపరంజిరాజు, నాయకులు చిన్నదొరై, విజయకుమార్, శ్యామ్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్): అర్హులందరికీ సంక్షేమపథకాల ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శివనాధపాళెం సచివాలయ పరిధిలోని దొంగలమూడురు, కారకొల్లు, దళితవాడ, తుమ్మలగుంట, శ్రీకృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాల్లోని వారు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అర్హులైన ప్పటికీ పథకాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, పార్టీ మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు చంద్రబాబునాయుడు, చెంచుకృష్ణమ నాయుడు, మోహన్ కిషోర్ నాయుడు, మణి, వెంకటరామ నాయుడు, ఎంపీటీసీ శైలజ, తహసీల్దార్ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, ఎస్‌ఐ రాఘవేంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు శివనాధపాళెంలో..

తొట్టంబేడు మండలం శివనాధపాళెం, శివనాధపురం, రామలింగాపురం ఎస్టీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని పార్టీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి తెలిపారు.

భవితలో ఫిజియోథెరపీ శిబిరం



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ జ్ఞానేశ్వర్

సత్యవేడు: క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే మెదడు పాక్షిక పక్షపాతం, కాళ్లుచేతుల వంకర్ల లోపాలను నయం చేయవచ్చని డాక్టర్ జ్ఞానేశ్వర్ అన్నారు. సోమవారం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల సహిత పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరాన్ని ఎంఈఓ కే.రవి ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, ఇక్కడ చేయించే తేలికపాటి వ్యాయామాలను రెండుపూటలా ఇళ్ల వద్ద తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాల పిల్లలకు చేయిస్తే వైకల్య శాతం తగ్గుతుందన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వం పిల్లలకు ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, క్యాలిపర్స్, వీల్‌చైర్లు, ఎంఆర్ కిట్లు అందజేస్తోందన్నారు. కేంద్రం పరిధిలో 83మంది పిల్లలు ఉన్నారు. పలువురు పిల్లలకు వ్యాయామాలు చేయించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ జయశంకర్, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయానికి కుర్చీల వితరణ

ఏర్పేడు: మండల పరిషత్ కార్యాలయానికి సోమవారం మండలంలోని రావిళ్లవారికండ్రిగకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోపీ యాదవ్ 10 కుర్చీలను ఎంపీడీఓ గిడ్డయ్యకు అందజేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గున్నేరి కిషోర్‌రెడ్డి సూచన మేరకు వీటిని వితరణ చేసినట్టు గోపీ యాదవ్ చెప్పారు.

ప్రముఖులకు ఆహ్వానం



ఎంపీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సోమవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను ఆహ్వానించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలానికి ఆహ్వాన పత్రికలతోపాటు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, పార్టీ నాయకులు నరసింహులు, బాలాగౌడ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు డిజిటల్ టైమర్లు

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పంచాయతీలో వీధి లైట్లకు సర్పంచ్ గంగారి రమేష్ ఆధ్వర్యంలో డిజిటల్ టైమర్లను సోమవారం ఏర్పాటు చేశారు. పట్టపగలు కూడా వీధి లైట్లు వెలుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో సర్పంచ్ స్పందించారు. ఆటోమేటిక్‌గా ఆన్, ఆఫ్ అయ్యేలా ఎండీ సొల్యూషన్స్ అధినేత మహేష్ సహకారంతో టైమర్లను అమర్చారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హుండీల లెక్కింపు రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించనున్నట్టు ఈవో సాగర్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను కూడా లెక్కిస్తామని, ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు.

వ్యసనాలతో అనర్థాలు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

వరదయ్యపాళెం: వ్యసనాలు అనర్థాలకు కారణమవుతాయని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి అన్నారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాల గురించి సోమవారం సాయంత్రం స్థానిక పురవీధుల్లో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. యువత సన్మార్గంలో పయనించి డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యసనాల బారిన పడి చేజేతులా జీవితాన్ని అంధకారం చేసుకోరాదన్నారు.



పెద్దపాండూరు మార్గంలో పిట్టగోడ లేని కల్వర్టు

డేంజర్.. డేంజర్

- పిట్టగోడ లేక కల్వర్టు వద్ద ప్రమాదాలు
- దృష్టి సారించని ఆర్‌అండ్‌బీ అధికారులు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్దపాండూరు–వరదయ్యపాళెంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో పాండూరు చెరువు వద్ద కలుజు నీరు వెళ్లే వంతెన వద్ద పిట్టగోడ నిర్మించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పెద్దపాండూరు చెరువు నుంచి పొలాలకు సాగునీరు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో గతంలో పైపు కల్వర్టును నిర్మించారు. అయితే కల్వర్టుకు ఇరువైపులా పిట్టగోడ నిర్మించకపోవడంతో ఆ మార్గంలో ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు కల్వర్టు వద్ద కాలువను గమనించక నేరుగా కాలువలోకి వాహనాలు దూసుకెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే కల్వర్టు వద్ద ఇటీవల కొయ్యల లోడుతో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురై డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పిట్టగోడను నిర్మించాలని కోరుతున్నారు.

హుండీ ఆదాయం రూ.2.39 లక్షలు

నాయుడుపేటటౌన్: గ్రామదేవత పోలేరమ్మ ఆలయానికి హుండీల ద్వారా రూ.2.39 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ పాయ సంశాంతారావు తెలిపారు. సోమవారం స్థానిక దేవాదాయశాఖ అధికారి శాంశక్‌కుమార్ సమక్షంలో సీవీ రామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలు లెక్కించారు. హుండీలో మొత్తం రూ.2,39,699 ఆదాయం వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. ఆ నగదును బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు.

కుష్ఠుపై అవగాహన ర్యాలీ





తొట్టంబేడు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, బుచ్చినాయుడుకండ్రిగ : కంచనపుత్తూరులో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని తొట్టంబేడు దళితవాడలో సోమవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరి మాట్లాడారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స గురించి తెలియజేశారు. అలాగే చిన్నపిల్లలలో వచ్చే న్యూమోనియో వ్యాధిపై కాలనీలోని చిన్నపిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తొట్టంబేడు సర్పంచ్ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్లు కామరాజు, భారతి, పీహెచ్‌ఎన్ సంపూర్ణ, ఏఎన్ఎం వరలక్ష్మి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచనపుత్తూరులో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కుష్ఠు అనుమానిత లక్షణాలు ఉన్న వారు ఆరోగ్య కార్యకర్తలు లేదా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని, కుష్ఠు అని నిర్ధారణ అయితే డాక్టర్ల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులు వాడి వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వైద్య, సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓజిలి: ప్రియురాలి ఇంటి ఎదుటే ప్రియుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మండలంలో కురుగొండ గ్రామంలో ప్రియురాలు యువతి ఇంటి ఎదుటే ప్రియుడు శివతేజ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన విదితమే. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శివతేజ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దారం ఆదిలక్ష్మి తెలిపారు.

ఆర్సీపురం పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

రామచంద్రాపురం: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బ్లూకోర్ట్ వాహనాలతో రాయలచెరువుకట్టపై పట్రోలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. డీఎస్పీ నరసప్ప, సీఐలు చంద్రశేఖర్ పిళ్లై, ఓబులేశు, ఎస్‌ఐ గిరిబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కోట: మండలంలోని విద్యానగర్ వద్ద సోమవారం రాత్రి లారీ, మోటార్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వాకాడుకు చెందిన సునీల్‌కుమార్ విద్యానగర్ నుంచి వాకాడుకు మోటార్‌బైక్‌పై వెళుతుండగా ధాన్యం లోడుతో గూడూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో సునీల్‌కుమార్ కాలికి తీవ్రగాయమైంది. ఎస్‌ఐ పుల్లారావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు.

పేదలకు అల్పాహారం వితరణ



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ సేవా కార్యక్రమంలో భాగంగా వెంకటశివ ఫుట్ వేర్ అధినేత రాటకొండ బాబు నాయుడు సోమవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద 450 మందికి అల్పాహారం అందజేశారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, కార్యదర్శి వికాస్, కోశాధికారి వనాద్రి, ఈశ్వరయ్య, పద్మనాభం, శీను పాల్గొన్నారు.



పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

దోపోత్సవం

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో దోపోత్సవం నిర్వహించారు. మొదల ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. –శ్రీకాళహస్తి

అటవీ భూమిలో శ్మశానం మాకొద్దు



వినతిపత్రం ఇస్తున్న అనిల్‌కుమార్, కుప్పయ్య

తిరుపతి మంగళం: అటవీ భూమిలో శ్మశానం వద్దని తిరుపతి 50వ డివిజన్ కార్పొరేటర్ బోకం అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పయ్య, తిమ్మినాయుడుపాళెం హరిజనవాడ వాసులు తెలిపారు. వారు సోమవారం తిరుపతి డివిజనల్ ఫారెస్ట్ అధికారి సతీష్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాతల కాలం నుంచి తిమ్మినాయుడుపాళెం పాత హరిజనవాడ వద్ద ఉన్న శ్మశానంలో కర్మక్రియలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ స్థలాన్ని తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటరత్నం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. ఇప్పుడు అటవీ భూమిని శ్మశానానికి ఇవ్వాలని గ్రామంలోని కొందరిని రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. శ్మశానంలోని నిర్మాణాలను తొలగించాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. శ్మశానం పేరిట అటవీ భూమిలో ఆక్రమణలకు యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ కుప్పయ్య, బొజ్జయ్య, మణి, పార్థసారథి, యువరాజ్ కోరారు.